శ్రీశైలం నాలుగు గేట్ల ద్వారా నీటి విడుదల



శ్రీశైలం ప్రాజెక్టు (అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ కృష్ణా నది ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం పెరుగుతుండటంతో శ్రీశైలం జలాశయం నాలుగు క్రస్ట్ గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. ఎగువన ఉన్న జూరాల, హంద్రీ, సుంకేశుల జలాశయాల నుంచి నీటి ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 1,18,464 క్యూసెక్కులు సుంకేశుల జలాశయం నుంచి 72,114 క్యూసెక్కులు హంద్రీ నుంచి 250 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. జలాశయం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరటంతో శ్రీశైలం కుడి, ఎడమ జలవిద్యుత్ కేంద్రాలతో పాటు స్పిల్ వే ద్వారా 1,79,971 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయంలో నీటి మట్టం 884.70 అడుగులకు, నీటి నిల్వ 213.8824 క్యూసెక్కులుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యం మీ చేతుల్లోనే!

- 55 శాతం విద్యార్థుల స్నాక్స్ డబ్బాల్లో జంక్ ఫుడ్
- తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలంటున్న వైద్యులు

ఈనాడు, మహబూబ్‌నగర్ -న్యూస్‌టుడే, నారాయణపేట పట్టణం



గద్వాల : ఇంటి నుంచి తెచ్చుకున్న పండ్లు చూపుతున్న ఓ పాఠశాల చిన్నారులు


చిన్నారులు వాతావరణంలో చిన్న చిన్న మార్పులనే తట్టుకోలేరు.. వాంతులు, విరేచనాలు, జ్వరం బారినపడి ఇబ్బందుల పాలవుతారు. ఒక్కసారి అస్వస్థతకు గురైతే వారం వరకు కోలుకోరు. అలాంటి వాళ్లకు ప్రమాదకరమైన జంక్ ఫుడే రోజూ పెడితే వారి లేత పేగులు ఎలా తయారవుతాయి..? వారి ఆరోగ్యం ఎంత ప్రమాదంలో పడుతుంది..? వారి భవిష్యత్తు ఏమవుతుంది? ఆలోచిస్తేనే భయమేస్తుంది.. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది తల్లిదండ్రులు అలాంటి ఆహారమే పెడుతున్నారని 'ఈనాడు' పరిశీలనలో తేలింది. ఇలా చేయటం పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి, భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పరిస్థితిపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.



మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల చిన్నారుల స్నాక్స్ డబ్బాల్లో తెచ్చుకున్న బిస్కెట్లు, జంక్ ఫుడ్

55 శాతం మందికి జంక్ ఫుడే : నేడు మూడు, నాలుగేళ్ల ప్రాయం నుంచే చిన్నారులను బడికి పంపిస్తున్నాం. ఉదయం 9 గంటల కల్లా వారు పాఠశాలల్లో ఉంటున్నారు. మధ్యాహ్నం తినే భోజనం కూడా ఉదయమే వండి పంపిస్తున్నారు. మధ్యలో తినడానికి చిరుతిళ్లు (స్నాక్స్) డబ్బాలో పెడుతున్నారు. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లా కేంద్రాల్లోని పాఠశాలల్లో 1,000 మంది చిన్నారుల చిరుతిళ్ల డబ్బాలు 'ఈనాడు' పరిశీలించగా 55 శాతం చిప్స్, చాక్లెట్లు, మైదా పదార్థాలతో కూడిన ప్రమాదకర ప్యాకెజ్డ్ జంక్ ఫుడ్, బిస్కెట్లు కనిపించాయి. ఉరుకులు పరుగుల జీవితంలో సమయం లేదని తల్లిదండ్రులు సులభమైన పనిగా ఇలా చేస్తున్నారు. కొందరు తల్లిదండ్రులను అడిగితే పిల్లలు అవే తింటారని చెబుతున్నారు. 35.2 శాతం తల్లిదండ్రులు మాత్రం ఇంట్లో వండిన ఆరోగ్యకర ఆహార పదార్థాలు, చిరుతిళ్లు పంపించారు. మరో 9.8 శాతం మంది పిల్లలకు పండ్లను పంపించారు. మొత్తంగా 45 శాతం చిన్నారులకు మంచి ఆహారమే అందుతోంది.

1,000 మంది చిన్నారుల డబ్బాల పరిశీలనలో గుర్తించిన ఆహారం ఇలా..



గుర్తించినవి ఇవే..



అమలు కాని నిషేధం : నిబంధనల ప్రకారం ఐదో తరగతి లోపు చిన్నారులు ఉండే పాఠశాలలకు సమీపంలో చిప్స్, ఇతర జంక్ ఫుడ్ విక్రయించొద్దు. ఇది ఎక్కడా అమలు కావటం లేదు. పాఠశాలలకు ఆనుకునే ఉన్న దుకాణాల్లో యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు తల్లిదండ్రులు ఇచ్చే రూ.5, రూ.10లతో జంక్ ఫుడే కొనుక్కుని తింటున్నారు.



నీటి గంట అవసరం : చాలా పాఠశాలల్లో విద్యార్థులు స్నాక్ డబ్బాతో పాటు నీటిసీసాలు తెచ్చుకుంటున్నారు. 80 శాతం చిన్నారులు భోజనం సమయంలో మాత్రమే నీటిని తాగుతున్నారు. సీసాల్లోని నీటిని అలాగే ఇంటికి తీసుకొస్తున్నారు. పాఠశాలల్లో నీటి గంట(వాటర్ బెల్) అమలు చేయాల్సిన అవసరముంది.



ఈ ప్రయత్నం బాగు : మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి, జడ్చర్ల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి వంటి పట్టణాల్లోని కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు జంక్ ఫుడ్ తినకుండా ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాయి. ఎవరైనా జంక్‌ఫుడ్ తెచ్చుకుంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫోన్‌చేసి అవగాహన కల్పిస్తున్నారు.



ఇన్‌ఫెక్షన్లు, ఊబకాయం సమస్యలు : చిన్నారులకు జంక్ ఫుడ్ అలవాటైతే అన్నంపై ఆసక్తి చూపరు. జీర్ణ శక్తి మందగిస్తుంది. మాంసకృత్తులు, కార్బొహైడ్రేట్లు, విటమిన్లు అందక ఎదుగుదల లోపించి ఆరోగ్యం దెబ్బ తింటుంది. జంకుఫుడ్‌లో నూనె, కలుషిత పదార్థాలు అధికంగా ఉంటాయి. వాటిని తినటం వల్ల పిల్లలకు నీళ్ల విరేచనాలు అవుతాయి. వయస్సు పెరిగే కొద్దీ గ్యాస్, కడుపునొప్పి, ఊబకాయం, రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. తరచూ ఇన్‌ఫెక్షన్ల బారినపడి అస్వస్థతకు గురవుతారు.

- డా.బాల శ్రీనివాస్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి



పండ్లు, పోషకాహారం అవసరం.. : ప్యాకింగ్ ఆహారంలో గ్యాస్ ఉంటుంది. కవర్ వాసన వస్తుంది. బిస్కెట్లలో మైదా ఎక్కువగా ఉంటుంది. వీటిని నమలకుండానే తినేస్తుటారు. ఇది చాలా ప్రమాదకరం. పిల్లలకు చిప్స్, ఇతర ప్యాకింగ్ ఆహారాన్ని స్నాక్స్ డబ్బాల్లో అస్సలు పెట్టొద్దు. ఐదో తరగతిలోపు చిన్నారులకు పండ్ల రసాలు, పండ్లు, క్యారెట్, కీరా, జావ, ఇంట్లో తయారు చేసే సంప్రదాయ అల్పాహారం పెట్టాలి. రక్తహీనత బారినపడకుండా పెద్ద పిల్లలకు పల్లీలు, బెల్లం చిక్కీలు, బాదం, పిస్తా, లడ్డూలు, ఉడకపెట్టిన గుడ్లు, పండ్లు అందించాలి.

- శైలజ, పోషకాహార కౌన్సిలర్, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

క్రమబద్ధీకరణపై కలెక్టర్ సమీక్ష

నారాయణపేట, న్యూస్‌టుడే : ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులపై జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం స్థానిక కార్యాలయంలో రెవెన్యూ, నీటి పారుదలశాఖ అధికారులతో మాట్లాడుతూ.. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులను వివరణ కోరారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మద్దూరు, కోస్గి మండలాల్లోనే ఎక్కువగా పెండింగ్‌లో ఉండటంపై అధికారులను హెచ్చరించారు. పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పట్టణ ప్రణాళిక అధికారి కిరణ్ యాప్‌లో తలెత్తుతున్న సందేహాలను నివృత్తి చేశారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా దరఖాస్తుల పరిష్కార దశలను వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీపీవో కృష్ణ, వివిధ మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

క్రీడలతో వెలుగులోకి సామర్థ్యాలు..

నారాయణపేట, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీసేందుకు క్రీడలు దోహదం చేస్తాయని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం పేట మండలం సింగారం చౌరస్తాలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీని ఎస్పీ యోగేష్ గౌతంతో కలిసి ప్రారంభించారు. అక్కడి నుంచి పేట సత్యనారాయణ చౌరస్తాకు ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే నెలలో ప్రారంభం కానున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక వికాసం, క్రీడా స్ఫూర్తిని కలిగిస్తాయని వివరించారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ ఘని, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సదాశివారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ధన్వాడ, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆదేశాలతో ధన్వాడ పట్టణంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులను పంచాయతీరాజ్ శాఖ ఏఈ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యే కార్యదర్శి చిట్టెం మాధవరెడ్డి శనివారం పరిశీలించారు. కేజీబీవీ నుంచి అంతర్గత మురుగు కాల్వ నిర్మాణానికి రూ.పది లక్షలు మంజూరు కాగా ఆ పనులను పరిశీలన చేశారు. డిగ్రీ కళాశాలను పాత తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో చేపట్టాల్సిన పనులను గుర్తించారు. ఇందుకు రూ.15 లక్షలు మంజూరైనట్లు ఏఈ వెల్లడించారు. కోటపక్క ఆంజనేయస్వామి ఆలయాభివృద్ధి పనులు వెంటనే మొదలు పెట్టాలని మాధవరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లక్ష్మయ్యగౌడ్, రాంచంద్రయ్య, సుధాకర్‌రెడ్డి, రహ్మాన్‌ఖాన్, ఆనంద్, రాఘవేందర్‌రెడ్డి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : నారాయణఖేడ్‌లో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల షూటింగ్‌బాల్ పోటీల్లో సంగంబండ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. కౌసల్య, భూమిక, వైష్ణవి, మనీష, ఐశ్వర్యలు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు విశ్రాంత పీఈటీ బి.గోపాలం తెలిపారు. నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకు కోల్‌కతాలో జరిగే జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థినులను ప్రిన్సిపల్ చంద్రకళ, ఉపాధ్యాయులు ప్రియాంక, శారదలు అభినందించారు.

పీయూ ఉపకులపతి బాధ్యతల స్వీకరణ

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతిగా డా.జీఎన్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది మే 21 నుంచి ఉపకులపతి పోస్టు ఖాళీగానే ఉంది. లక్ష్మీకాంత్ రాథోడ్ తర్వాత రెగ్యులర్ ఉపకులపతి రాకపోవడంతో రాష్ట్ర ప్రణాళికా సంఘం ముఖ్య కార్యదర్శిగా పనిచేస్తున్న నదీం అహ్మద్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన నుంచి శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. సోమవారం ఉపకులపతి శ్రీనివాస్ పాలమూరు విశ్వవిద్యాలయానికి రానున్నారు.



ఇన్‌ఛార్జి వీసీ నదీం అహ్మద్ నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్



- 'అబ్బబ్బా.. ఈ మధ్య పని ఎక్కువైంది. మా పిల్లలు తిన్న తర్వాత కంచం తీయరు. బడి నుంచి వచ్చి పుస్తకాల సంచి ఓ చోట, దుస్తులు మరోచోట పారేస్తారు. వాటిని సర్దాలంటే తల ప్రాణం తోక కొస్తోంది'.

అంటూ ఓ తల్లి పని మొత్తం చేస్తారు

- 'మా పాప డిగ్రీ చదువుతోంది.. ఇల్లు ఊడ్చదు. కంచంలోంచి కింద పడిన మెతుకులు తీయదు. మా వాడికేమో దుప్పటి మడతపెట్టడం రాదు. గదుల్లో లైట్లు ఆఫ్ చేయాలన్నా మా పనే..'

మరో మాతృమూర్తి ఇంటి పనంతా చక్కబెడతారు

ఇంత వరకు బాగానే ఉన్నా, వారిని మార్చాల్సింది.. కొంతలో కొంతైనా పని నేర్పాల్సింది కుటుంబ సభ్యులు.. తల్లే కదా!

ఆదివారం అమ్మకు తోడుగా..

న్యూస్‌టుడే-కొత్తకోట



సెలవుల్లో చరవాణులను పక్కన బెట్టి అమ్మకు సాయం చేద్దాం అనే భావన పిల్లల్లో కల్పించాలి. వారిలో తప్పని సరిగా మార్పు వస్తుంది. వారు కోరుకున్న వంట వారి చేతే చేయించండి. ఆ అనుభూతే వేరు. ప్రేమించడం తప్పు కాదు.. కాని, ఆ ప్రేమలో తెలియకుండానే సోమరితనంగా మారిస్తే జీవన నైపుణ్యాలు లేక పిల్లల ఉన్నతికి ప్రతిబంధకమవుతుంది. విద్య, ఉపాధి అవకాశాలకు గడప దాటినప్పుడు కొత్త వాతావరణంలో ఇమడలేక గందరగోళంలో పడతారని నిపుణుల హెచ్చరిక. బాల్యంలో ఇంటి పనులు నేర్పితే గృహ నిర్వహణలో ఆర్థిక, భౌతిక, సాంఘిక, భావోద్వేగ నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని విద్యాశాఖ చెబుతుంది. 3 నుంచి 5వ తరగతులకు పని, విద్య నిర్దేశించిన అంశాల్లో ప్రస్తావించింది. వీటిని 'ఆదివారం' నుంచి ఆచరించడంలో పిల్లలను ప్రోత్సహిద్దాం.

బాధ్యత పెరుగుతుంది : సొంతంగా పనులు చేయడం వల్ల పిల్లల్లో బాధ్యత పెరుగుతుంది. వారిలో ధైర్యం, పట్టుదల, క్రమ శిక్షణవంటి లక్షణాలు అలవడుతాయి. వారిపై నమ్మకం ఏర్పడుతుంది. సేవాలక్షణాలు పెరిగి సమాజ సేవలో పాల్గొంటారు. ఇంట్లో అందరూ పనిచేయడం వల్ల కుటుంబమంతా కలిసి గడిపే నాణ్యమైన సమయం పెరుగుతుంది. సంబంధ బాంధవ్యాలు మెరుగవుతాయి. మంచి చెడు పంచుకోవడంతో ఈ తరాన్ని వేధిస్తున్న ఒత్తిడి, కుంగుబాటు, ఆందోళన వంటివి దరి చేరవు.

పిల్లలతో ఇంటి పనులు చేయిద్దాం

(పని, విద్య పుస్తకంలో నిర్దేశించిన కృత్యాలు)

- ఉతికి ఆరేసిన దుస్తులను మడత పెట్టి భద్రపరచుకోవడం
- చెప్పులు, బూట్లను శుభ్రం చేసి క్రమపద్ధతిలో పెట్టుకోవడం
- విడిచిన దుస్తులు తల్లిదండ్రుల సలహా మేరకు వేయడం
- వినియోగ వస్తువులను, దుస్తులు, పుస్తకాలు, క్రమపద్ధతిలో అమర్చుకోవడం
- ఇంటి సరకులు తీసుకురావడంలో సాయం చేయడం
- నీళ్లు పట్టడం, ఇల్లు శుభ్రం చేయడం, వంట చేయడంలో సహకరించడం
- మొక్కలకు నీళ్లు పట్టడం, ఎరువులు వేయడం
- భోజనవేళలో తాగునీరు ఏర్పాటు చేయడం, కంచాలు తీసి కడగడం
- మరుగుదొడ్లను వినియోగించాక నీరు పోసి పరిశుభ్రంగా ఉంచడం





తల్లిదండ్రులదే బాధ్యత : పిల్లల్ని మీరు నిజంగా ప్రేమిస్తున్నట్లయితే వారితో తరచూ ఇంటి పనులు చేయించండి. వారికి బాధ్యతలను గుర్తు చేయండి. ఏ పని చేస్తున్నా బాగుంది.. ఇంకా వేగంగా.. మెరుగ్గా.. చేయగలవంటూ ప్రోత్సహించండి. వారి భాగస్వామం లేకుండా కుటుంబ పనులు పూర్తి కావని అర్థమయ్యేలా చెప్పండి. పిల్లల్ని ప్రేమించడంతో పాటు వారికి అన్ని నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత.

- శ్రీనివాసరాజు, మానసిక వైద్యనిపుణులు, మహబూబ్‌నగర్



ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం



నారాయణపేట శివారులో పరిశీలిస్తున్న అధికారులు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : వేగం మందగించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ ఇక నుంచి పుంజుకోనుంది. గత ప్రభుత్వంలో జాప్యం కారణంగా ప్రస్తుత సర్కార్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. పురపాలక, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అయితే ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. దీంతో గురువారం నుంచి వార్డు అధికారులను కూడా దరఖాస్తుల పరిశీలనలో భాగం చేసింది. మూడు శాఖల అధికారులతో కలిసి వీరు కూడా పాల్గొనడంతో దరఖాస్తుల ప్రక్రియ వేగం పెరగనుంది. ఇప్పటి వరకు జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి పురపాలికల్లో 21,367 దరఖాస్తులు వచ్చాయి.

స్థానికంగా ఉండటం లేదు..: అధికారులు పరిశీలనకు వెళ్లిన సమయంలో ప్లాటు ఎక్కడుందో యజమానులు చూపించాలి. అయితే వారు స్థానికంగా లేకపోవడం.. సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరుగుతోంది. హైదరాబాద్, ముంబయి, బెంగళూర్ తదితర ప్రాంతాల్లో ఉన్నవారు రావడానికి సమయం పడుతుంది. ఫోన్ చేసిన స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు వారి ప్లాట్లలో చెట్లు, ముళ్ల పొదలు పెరగడంతో గుర్తించడం కష్టంగా మారిందంటున్నారు.

పురపాలికల్లో దరఖాస్తుల వివరాలు..

పురపాలికలు	దరఖాస్తులు	పరిష్కారం	పెండింగ్	తిరస్కరించినవి
నారాయణపేట	6,960	1,558	5,230	172
మక్తల్	10,498	628	9,870	-
కోస్గి	3,909	727	2,933	249

మరింత వేగవంతం..

దరఖాస్తు చేసుకున్నవారు ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. వారికి అధికారులు ఫోన్ చేసి అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నారు. దరఖాస్తు పరిశీలన మరింత వేగవంతం చేసి, పూర్తి చేస్తాం.

- సునీత, పుర కమిషనర్, నారాయణపేట

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యారంగ అభివృద్ధికి కేంద్రం 10 శాతం, రాష్ట్రం 20 శాతం నిధులు కేటాయించాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవచారి, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో శనివారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యారంగ సమస్యలు - సవాళ్లు - కర్తవ్యాలు అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాఘవచారి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించిందని, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు 12 శాతం నిధులు ఇచ్చినట్లు వివరించారు. విశ్వవిద్యాలయాల్లో దాదాపు 2 వేల ప్రొఫెసర్ ఉద్యోగాలు ఖాళీగా ఉండటంతో పాటు లక్షల్లో నిరుద్యోగులు ఉండటం విద్యా సంక్షోభానికి ఒక ఉదాహరణగా చెప్పారు. నారాయణమ్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 30 వేల పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ని వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు రెడ్డప్ప, సూర్యచంద్ర, హైమావతి, వెంకట్రాములు, పీసీఐ నాయకులు కొండన్న, ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాములు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరకొర కేటాయింపులతో అవస్థలు

ఉద్యాన రైతులకు దక్కని తుంపర పరికరాలు



వేరుశనగ చేనులో తుంపర పరికరాలు

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ వ్యవసాయం : ఉద్యాన శాఖలో తుంపర పరికరాల పంపిణీ పెద్ద సమస్యగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై తుంపర పరికరాలను అందించాలని నిర్ణయించినా ఒక్కో మండలానికి ఐదు యూనిట్లను కూడా కేటాయించలేదు. యాసంగి పంటగా వేరుశనగ సాగు చేసిన రైతుల నుంచి మాత్రం భారీగా డిమాండ్ ఉంది. ఒక్క నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏకంగా 6,500 మంది రైతులు తుంపర పరికరాలు కావాలని దరఖాస్తు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్క జోగులాంబ గద్వాల జిల్లాలోనే డిమాండ్ తక్కువగా ఉంది. జిల్లాకు 80 యూనిట్లను మాత్రమే కేయించగా ఎస్సీ, ఎస్టీ రైతులను ఎంపిక చేశారు. మరో 500 మంది వరకు రైతులు పరికరాల కోసం ఎదురు చూస్తున్నారు.

జిల్లా	దరఖాస్తులు	యూనిట్లు
నాగర్‌కర్నూల్	6,500	516
మహబూబ్‌నగర్	2,900	100
నారాయణపేటలో	3,200	100
వనపర్తిలో	5,000	162
గద్వాల	580	80

ప్రచారం లేకపోయినా భారీ దరఖాస్తులు : ఉమ్మడి జిల్లాలో వేరుశనగ పంట 2.60 లక్షల ఎకరాల్లో సాగైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో 1.20 ఎకరాల్లో సాగు చేశారు. ఇంకా సాగవుతుంది. అందుకే ఇక్కడ తుంపర పరికరాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. గడచిన ఐదేళ్లుగా తుంపర పరికరాలపై గత ప్రభుత్వం రాయితీ ఇవ్వలేదు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.23,385గా ధర నిర్ణయించింది. ఇందులో ప్రభుత్వం 75 శాతం అంటే రూ.17,539 రాయితీగా భరిస్తుంది. మిగతా 25 శాతంగా రూ.7,483లను రైతు డీడీ తీసి ఉద్యాన శాఖకు సమర్పిస్తే 25 హెచ్‌డీ పైపులు, ఐదు తుంపర పరికరాల నాజిల్స్ అందిస్తారు. ఉమ్మడి జిల్లాకు 958 యూనిట్లను మాత్రమే కేటాయించగా 18,100 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రాయితీ ఇస్తున్నట్లు ప్రచారం చేసి ఉంటే ఇంకా రెండు మూడింతల దరఖాస్తులు వస్తాయంటే అతిశయోక్తి కాదు.

అధికారులకు తలనొప్పిగా.. : ఉద్యాన శాఖ అధికారులు ప్రభుత్వం కేటాయించిన అరకొర యూనిట్లను వేల మంది దరఖాస్తుదారుల్లో ఎవరికి పంచాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే కొందరు రైతులు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు తెచ్చి కార్యాలయాల్లోని అధికారులకు అందిస్తున్నారు. కొందరు ఫోన్లు చేయిస్తున్నారు. జిల్లాల అధికారులు ఎవరినీ ఎంపిక చేయకుండా మరిన్ని యూనిట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల ఉద్యాన శాఖ అధికారులు జగన్, అక్బర్, వేణుగోపాల్, సురేష్‌లు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఎమ్మెల్యేలు కూడా చెప్పారని పేర్కొన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా వాసికి ఐఏఎస్‌గా పదోన్నతి



చంద్రశేఖర్‌రెడ్డి

అచ్చంపేట, న్యూస్‌టుడే : జిల్లాకు చెందిన గ్రూపు-1 అధికారికి ఐఏఎస్‌గా పదోన్నతి లభించింది. ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన కట్ట చంద్రశేఖర్‌రెడ్డి గ్రూపు-1 అధికారిగా వివిధ బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. హైదరాబాద్‌లో వివిధ శాఖల అధికారిగా బాధ్యతలు నిర్వహించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు ఐఏఎస్ అధికారిగా పదోన్నతి కల్పించడంతో ఉప్పునుంతల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పునుంతల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, నేతలు సీహెచ్ శ్రీను, శేఖర్‌గౌడ్, కట్ట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

బాంబు స్క్వాడ్ సిబ్బందికి పతకాలు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : తెలంగాణ పోలీసు మొదటి డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ తరపున నారాయణపేటకు చెందిన బాంబు స్క్వాడ్ సిబ్బందికి మెడల్ వచ్చింది. పేటకు చెందిన చంద్రశేఖర్, ఆంజనేయులు సిల్వర్ పతకాలు సాధించారు.

(c) eenadu

కృష్ణాతీరం.. పర్యాటక సోయగం!



సోమశిలకు పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో వారాంతాల్లో ఇక్కడ సందడిగా ఉంటోంది. నదిని ఆనుకుని ప్రకృతి ఒడిలో సేదతీరేందుకు వచ్చేవారిని ఆకట్టుకునేలా కొత్త రిసార్టులు వెలుస్తున్నాయి. సోమశిలలో ఓ చోట కనిపించిన దృశ్యాన్ని 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

హంగుల్లో తగ్గేదేలే!

హైదరాబాద్‌కు దీటుగా పాలమూరులోనూ గృహాలంకరణ



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే పోలీస్ ఉద్యోగి తన అభిరుచి మేరకు అద్భుతంగా ఇంటిని నిర్మించారు. 235 గజాల స్థలంలో రూ.1.60 కోట్లతో ఇంటిని సుందరంగా తీర్చిదిద్దారు. ఆ ఇంటిలోని ఓ గదిలో గోడకు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన హంస బొమ్మ ఆకట్టుకుంటోంది. కేవలం ఆ బొమ్మ కోసమే రూ.42 వేలు ఖర్చు చేశాడు. ఇంటిలోని అంతర్గత నిర్మాణం కోసం రూ.16లక్షలు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ కాలనీలో నివాసం ఉండే ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయురాలు తన ఆసక్తి మేరకు 185 గజాల్లో రూ.1.40 కోట్లతో ఇంటిని నిర్మించుకున్నారు. ప్రతి గదిలో అందంగా ఆకట్టుకునేలా బొమ్మలు, ఇతర గృహోపకరణాలను వినియోగించారు. పడక గదిలో విభిన్నంగా విద్యుత్తు కాంతి వచ్చేలా అద్భుతంగా చిత్రాలు అమర్చారు. గృహాలంకరణకు దాదాపు రూ.12 లక్షల వరకు ఖర్చు చేశారు.



మహబూబ్‌నగర్ : ఓ ఇంట్లోని హోం థియేటర్

న్యూస్‌టుడే, పాలమూరు, కల్వకుర్తి

ఇల్లు కట్టుకోవటం ఓ కళ. అన్ని హంగులతో ఇంటిని ఏర్పాటు చేసుకొని చిరకాల వాంఛ తీర్చుకుంటున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పట్టణాల్లో రహదారుల సుందరీకరణ, తదితర సౌకర్యాలు సమకూరుతున్నాయి. దీంతో రూ. కోట్లు ఖర్చు చేసి భవనాల నిర్మాణం చేసుకుంటున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వసతులు సమకూరుతున్నాయి. అయిదు జిల్లా కేంద్రాలతో పాటు మొత్తం 19 పురపాలికల్లో కాలనీలు వేగంగా విస్తరిస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్ర రాజధాని నగరం 100 కిలోమీటర్ల పరిధిలోనే ఉండటంతో ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో హంగులతో సొంతింటికి మొగ్గు చూపుతున్నారు. అవసరాలు, అభిరుచుల మేరకు అధునాతన వసతులు, భవనాలను అద్భుతమైన రీతిలో నిర్మించు కుంటున్నారు.

● హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా గృహాలంకరణ నిపుణులను పిలిచి పనులు అప్పగిస్తున్నారు. గదుల్లో అలంకరణ, పడక, పూజ గదులను దేనికదే ప్రత్యేక సంతరించుకునేలా తీర్చిదిద్దుకుంటున్నారు. ఓపెన్ కిచెన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. సామాన్య ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, ఉన్నతోద్యోగులు, రాజకీయ నాయకుల ఇళ్లలోనూ ఆకర్షణీయ హంగుల కోసం ఖర్చుకు వెనుకాడటం లేదు.



కల్వకుర్తి : ఓ ఇంట్లో జిగేల్‌మనిపించే గది అలంకరణ



రూ.5 లక్షలతో నిర్మించిన అధునాతన వంట గది



చేతితో తాకే అద్దంలో వెలుగుతున్న విద్యుద్దీపాలు

ఉత్సాహంగా సీఎం కప్ క్రీడా జ్యోతి ర్యాలీ

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికి సీఎం కప్-2024 క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు గద్వాల జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ పేర్కొన్నారు. శనివారం గద్వాలకు చేరుకున్న సీఎం కప్ క్రీడా జ్యోతికి సంగాల పార్క్ వద్ద కలెక్టర్, ఎస్పీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గాంధీ చౌక్, పాతబస్టాండ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, పదో పటాలం డీఎస్పీ రఘునాథ్ చౌహాన్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సంతోష్, చిత్రంలో ఎస్పీ, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్ తదితరులు

పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం

పాలమూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాలమూరు విద్యార్థినికి ప్రథమ స్థానం లభించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ రచయితగా పాలమూరు జిల్లా కేంద్రంలోని దక్ష ఉన్నత పాఠశాల విద్యార్థిని దీక్షిత విజయం సాధించింది. ఈ మేరకు ఆ విద్యార్థినికి ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ ప్రశంసాపత్రాన్ని అందించారు. రాష్ట్ర స్థాయిలో పాలమూరు విద్యార్థిని ప్రథమస్థానంలో నిలిచి బహుమతిని గెలిచినందుకు అభినందనలు తెలుపుతున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో సీఎంవో బాలుయాదవ్, డీసీఈబీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



దీక్షితకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్

వేములలో ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

అడ్డాకుల, న్యూస్‌టుడే: మూసాపేట మండలం వేముల గ్రామంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 బాల బాలికల వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ తెలిపారు. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో గద్వాల జిల్లా, తృతీయ స్థానంలో నారాయణపేట జిల్లా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో మహబూబ్‌నగర్ జిల్లా, ద్వితీయ స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా, తృతీయ స్థానంలో గద్వాల జిల్లా జట్లు నిలిచాయి. ఈనెల 28న పెద్దపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గెలుపొందిన క్రీడాకారుల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఒక జట్టును ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధికారులు శారదాబాయి, పాండు, జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, వడెన్న, జేపీఎన్‌సీఈ రవికుమార్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



తలపడుతున్న మహబూబ్‌నగర్, గద్వాల జట్లు

రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు క్రీడాకారుల ఎంపిక

మహబూబ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలో పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించే విలువిద్య పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-14, 17 బాల బాలికల జట్లను శనివారం మహబూబ్‌నగర్‌లోని బీఎస్‌ఏ మైదానంలో ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న విలువిద్య పోటీలకు ఈ జట్లను పంపడం జరుగుతుందని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, విలువిద్య కోచ్ జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి అండగా ఉంటా : కేటీఆర్

అయిజ, న్యూస్‌టుడే: అయిజ మండలం వెంకటాపూర్‌కు చెందిన వైద్య విద్యార్థి సుస్మితకు అండగా ఉంటామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. వెంకటాపూర్ గ్రామానికి చెందిన బుజ్జమ్మ, దేవదాసు దంపతుల కూతురు సుస్మిత నీట్‌లో ప్రతిభ చాటి ఉస్మానియా మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. తల్లిదండ్రులు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందిపడుతున్నారని కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. స్పందించిన కేటీఆర్ 'ఐ విల్ సపోర్ట్ పర్సనల్లీ' అంటూ 'ఎక్స్'లో సందేశం పెట్టడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.



'ఎక్స్'లో కేటీఆర్ సందేశం

తృటిలో తప్పిన ప్రాణాపాయం

మానవపాడు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ దాటిస్తున్న క్రమంలో కర్నూలు నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టిందని కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ఏఎస్సై రమేష్‌రెడ్డి తెలిపారు. పెద్దపోతులపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పొలం పనులు ముగించుకొని స్వగ్రామానికి వెళ్తున్నాడు. శివారులోని రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) కింద వర్షపునీరు నిలవడంతో సదరు వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని రైల్వే ట్రాక్ మీద దాటించేందుకు ప్రయత్నించాడు. ఇంతలో రైలు వచ్చేసింది. ద్విచక్ర వాహనాన్ని వదిలేసి రైతు సురక్షితంగా బయటపడ్డాడు. ద్విచక్రవాహనం కింద ఉండిపోవడంతో పది నిమిషాలు రైలు ఆగింది. దాన్ని ట్రాక్‌పై నుంచి తొలగించాక రైలు వెళ్లిపోయింది. లోకో పైలెట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.



రైలు చక్రాల వద్ద ద్విచక్ర వాహనం

యువకుల గొడవ సీసీ ఫుటేజీ వైరల్

శిరోముండనంలో పోలీసుల పాత్రపై బలపడుతున్న అనుమానాలు

ఈనాడు, మహబూబ్‌నగర్ - న్యూస్‌టుడే, లింగాల : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో ముగ్గురు యువకులకు శిరోముండనం చేసిన ఘటనకు ముందు జరిగిన గొడవ సీసీ కెమెరా ఫుటేజీలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ నెల 13న పెట్రోల్ బంక్‌లో గొడవ జరిగాక పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి ముగ్గురికి శిరోముండనం చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావటం, ఇందులో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తెలిసిందే. యువకుల మధ్య గొడవతోనే అతడు ఆత్మహత్యాయత్నం చేశాడని, పెట్రోల్ బంక్ వద్ద గొడవ, శిరోముండనం ఘటనలకు, తమకు సంబంధం లేదని పోలీసులు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ యువకులు పెట్రోల్ బంకు వద్ద గొడవ పడిన సీసీ కెమెరా ఫుటేజీ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో పోలీసులు కక్కలేని, మింగలేని పరిస్థితిలో పడిపోయారు. ఈ ఫుటేజీతో శిరోముండనం ఘటనలో పోలీసుల పాత్రపై అనుమానాలు బలపడుతున్నాయి. ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడి తల్లిదండ్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్న వీడియోలు బయటకు రావటంతో వారిపై రాజకీయ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసు స్టేషన్‌లోనూ సీసీ కెమెరాలు ఉంటాయి. అక్కడి ఫుటేజీలను ఉన్నతాధికారులు పరిశీలిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్న చర్చ జరుగుతోంది.

ఇటీవలే ఇసుక వ్యవహారం రచ్చ.. : దుందుభి వాగులో ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు 10 రోజుల కిందట జిల్లాలోని నలుగురు ఎస్సైలను వీఆర్‌కు పంపిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక వ్యవహారంలో ఇప్పటికే నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులపై మచ్చ పడింది. ఈ వ్యవహారం మరవక ముందే లింగాలలో యువకుల శిరోముండనం ఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పోలీసు శాఖ జిల్లా ఉన్నతాధికారులు అన్ని ఘటనలపై విచారణ చేపడతామని, చర్యలు తీసుకుంటామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అది కనిపించటం లేదన్న విమర్శలు వస్తున్నాయి. నేతల ఒత్తిడితోనే జిల్లా అధికారులు ఈ వ్యవహారంలో ముందుకు వెళ్లలేకపోతున్నారని వినిపిస్తోంది.

వాహనం నుంచి జారిపడి బాలకార్మికుడి మృతి

పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో శనివారం ఉదయం వాహనం నుంచి జారి కింద పడి బాలకార్మికుడు (17) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చుక్కాయిపల్లి నుంచి తాడూరుకు పత్తితీత కోసం కూలీలు సుమారు పన్నెండు మంది బొలేరో వాహనంలో బయలుదేరారు. పెద్దకొత్తపల్లి దాటాక అదుపు తప్పి వాహనంపైన కూర్చున్న బాలుడు (17) కిందపడ్డాడు. తీవ్ర గాయాలవడంతో నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలస్వామి శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలంలోని జానంపేటకు చెందిన పాటిమీటి చిన్నరాజు, లలిత దంపతులు. ఆమెకు అదే గ్రామానికి చెందిన మధుగాని కురుమూర్తితో వివాహేతర సంబంధం ఉంది. 2019 మే 30న కురుమూర్తి జాతరకు భార్యాభర్తలు ఇద్దరు వచ్చారు. అక్కడికి ఆమె ప్రియుడు కూడా వచ్చాడు. భర్తకు మద్యం తాపించి నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి టవల్‌తో గొంతుకు చుట్టి చంపేశారు. దీంతో మృతుడి అన్న అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం కేసు పరిశోధించి హత్యతో సంబంధం ఉన్నవారిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. బెయిల్‌పై బయటికి రాగా తరువాత న్యాయస్థానంలో కేసు నడుస్తోంది, అందులో వాదోపవాదనలు విన్న కుటుంబ న్యాయస్థాన జడ్జి శ్రీదేవి ఇద్దరు నిందితులకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానాను విధించారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Tippers for Sale. 2015 & 2018 & 2023 also. RMC Plant, 3 Transit Mixers. Call/ Whats App: 8008344544.

Green Honda Offering Exchange cars for sale @ reasonable Price. Honda Amaze -2013, Renault Duster-2013, Tata Tiago-2013 cars available for sale. Contact: 7799979918.

BUSINESS SERVICES

FOR SALE

Container అమ్మబడును. Address: అరవింద్ ఆగ్రో ఏజెన్సీ ఇంజనీరింగ్, లాల్ కోట చౌరస్తా. Ph. No: 9542774287

BUILDING CONSTRUCTION

WATER PROOFING

మీ యొక్క కొత్త మరియు పాత బిల్డింగ్ ల స్లాబ్‌లు, బయట మరియు లోపలి గోడలు, పిల్లర్ల ఫౌండేషన్లు మరియు ప్లింత్ బీమ్‌లు వాటర్ ప్రూఫింగ్ చేయబడును. ✆ 99485 26738, MBNR

EDUCATION

SPOKEN ENGLISH

Spoken English for VIPS at Home (Political Leaders / Officers / Business persons) కేవలము 15 రోజుల్లోనే (రోజు 2 గంటలు) మీ ఇంటికే వచ్చి ఈజీగా ఇంగ్లీష్‌లో ఏలా మాట్లాడాలో నేర్పించబడును. Training by A Venkat Reddy, AVR Institute of Spoken English. ✆ 8187041458

DISTANCE EDUCATION

రెగ్యులర్ & డిస్టెన్స్ డిగ్రీస్: డిగ్రీ, PG, B.Tech, డిప్లొమా, D & B.ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc(Agri), B.Sc (నర్సింగ్), GNM. Ph: 8866977112, 339

JOB TRAINING

US-IT HR Recruiter Online Training With placement, Qly: Any Degree/10+2 (M/F) With Avg. English Speaking. MBNR. Call 95504 01973

HEALTH & CARE

ORTHOPEDIC

డా॥ S.రవితేజ రెడ్డి, M.S., (Ortho) KMC Manipal ఎముకలు, నరములు, వెన్నుముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు, శిరీష పాలిక్లినిక్, 3వ లైన్, NR పేట, కర్నూలు. Ph: 83412 98666.

PERSONAL CLASSIFIEDS

LOST

పాస్‌పోర్ట్ పోయినది: నేను కొట్టం కల్పన D/o. గోవిందు, H.No: 30-142/2, ఎస్‌జి రోడ్, జడ్చర్ల. నేను నేతాజీ చౌక్ నుండి మా ఇంటికి వెళ్తుండగా నా యొక్క పాస్‌పోర్ట్ నెంబరు H2720778 పోయింది. దొరికిన వారు సంప్రదించండి: 9848099335

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (TG No-1) Hyd వృద్ధులకు, పేషెంట్ల సేవకు ఇంటి /వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 9160691122, 9515104450.

REAL ESTATE

HOUSE FOR SALE

North-East New G+1 House For Sale, 160 Sq. yds, With Muncipal Permission, Near SVS Hospital, MBNR. Ph: 9966975125

LAND FOR SALE

Land for sale Kotra to Hyderabad Highway (2 Acres) Highway Facing 200 feet Survey Number 506/a/aa/2 Contact: 8125769961

PLOT FOR SALE

HUDA Plot Sale @ Vanasthalipuram- Self Finance Cly N/W 173 Sq.Yds. (35x44) 40 Ft. Road (Avl G.Permission for G+2. Ph: 9849433784.

పాలకొండ నియర్ బైపాస్ రోడ్డుకు ఆనుకుని వెస్ట్ నార్త్ కార్నర్ 210 (35x54) గజాల ప్లాటు అమ్మటానికి ఉంది. 2. భూత్పూరు రోడ్ సారిక టౌన్‌షిప్ వెస్ట్ ఫేస్ 266 (40x60) హాస్పిటల్ బ్యాక్ సైడ్ ప్లాట్ అమ్మటానికి ఉంది. సంప్ర. సెల్: 9010 464 999.

PLOTS MELA
20 October (Sunday)
Sri Rameshwara Rao Nagar
Behind Srinivasa Theatre,
Jataragadda, JADCHERLA
Contact:
88860 02959
80085 92895

జడ్చర్ల టౌన్‌లో @ DTCP, RERA అప్రూవ్డ్ వెంచర్‌లో వెంటనే ఇళ్లు కట్టుకోవడానికి అనువైన ప్లాట్స్, సీసీ రోడ్స్, బ్యాంకు లోన్‌తో కలవు. ✆ 6309977999.

AGRICULTURE LANDS

1.75Ac వ్యవసాయ భూమి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి సమీపంలో మున్సిపల్ పరిధిలో, NH.44 ఆనుకొని ఉన్న భూమి. Ph: 9440868304, 9885934070

JOBS

Labour required for stalls work training provide with stay & food salary 12k, salary will increase after training. Ph:7013215571

Req. Field Verification Executives, Freshers & Exp. Q: Inter/ Graduate 2 Wheeler & DL must, Vacancy in Hyd & Telangana all Areas. 72073 01666, 70136 69384, 8688 958598.

Research Executive Wanted to Work in a Pharmaceutical R&D (Dr. Mark Lab) in Patancheru, Hyderabad. with B.Sc./M.Sc. Chemistry background. Cell: 75699 98126.

Urgent requirement for Sales Manager - Exp: 5 Years and Executives - Exp: 2 Years in Marketing and Sales to promote Educational products and services to schools. (preferably education). Location: Karimnagar, Nizamabad, warangal, Khammam and Hyderabad. Ph: 9177244424/ 9502842233 hr@scolaire.in

అప్పాజీపల్లి ఐరన్ కంపెనీ నందు Admin Officerగా పనిచేయుటకు 12th చదివిన 60 సం॥ల లోపు వయస్సుగల Retd. Army వారు కావలెను. జీతం 24000+Boarding & Lodging సంప్ర. సెల్: 9010800660

Wanted Staff Nurses, OT Technicians, Baby Care Taker, సంప్ర: అన్నపూర్ణ కిడ్నీ& యూరాలజీ హాస్పిటల్, తాలుకా క్లబ్ రోడ్, జడ్చర్ల. Cell: 9966502502

రామకృష్ణ ఓల్డేజ్‌హోం (TG No-1) Hyd. కొరకు 10th ఆపైన చదివిన 20-40 సం॥ల స్త్రీ/పు టెలికాలర్స్, కస్టమర్‌కేర్, బైక్ మెకానిక్‌లు కావలెను. భో+వ+ మంచి జీతం. ✆ 9440671190.

ఫైర్ వర్క్స్ షాప్‌లలో పనిచేయుటకు హెల్పర్స్, లేబర్స్ & బాయ్స్ కావలెను. ₹700/- ఇవ్వబడును. @ హైదరాబాద్ ★ ఉచిత వసతి. 8985612927/ 8688965665.

శ్రీనివాస హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. స్త్రీ/పురుషులు/ నర్సులు కావలెను. జీతం: 20,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. Hyd లో. ✆ 6301330889, 6300799407.

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్ద వాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + భో॥ Hyd. ✆ 7995984445.

బెంగుళూరులో వెజ్ & నాన్ వెజ్ వంటలు చేయుటకు అనుభవం గల ఒంటరి మగవారు కావలెను. జీతం రూ. 13 వేలు, భోజనం+ ఉండుటకు వసతి ఉచితం. ✆ 9740098047.

బట్టల షోరూమ్‌లో పనిచేయుటకు స్త్రీ/ పురుషులు కావలెను. భోజనం, వసతి కల్పించబడును. సూరారం, హైదరాబాద్. Ph: 9398503718

ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్‌లో కంప్యూటర్ ఆపరేటర్స్, ల్యాబ్ టెక్నీషియన్ పేషంట్ కేర్, రికార్డు అసిస్టెంట్ కావలెను. Ph: 7993337544, 7815832926.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar
8008709794



సస్యరక్షణ చర్యలకు సన్నద్ధం!

ప్రస్తుతం పంటలన్నీ పొట్టదశలో ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చీడపీడలు ఆశిస్తుండడంతో రైతులు పురుగు మందుల పిచికారీకి సన్నద్ధమవుతున్నారు. ఇందుకోసం పిచికారీ యంత్రాలకు అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నారు. యంత్రాల మెకానిక్‌లు కూడా తీరిక లేకుండా కనిపిస్తున్నారు. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద మరమ్మతుల కోసం రైతులు వరుసగా పెట్టిన పిచికారీ యంత్రాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది.

- ఈనాడు, మహబూబ్‌నగర్

పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ రన్నరప్

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ పోలీసులు సత్తా చాటారు. వీడియోగ్రఫీ విభాగంలో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని రాజ్ బహదూర్ వెంకట్రాంరెడ్డి పోలీస్ అకాడమీలో మూడు రోజుల నుంచి జరుగుతున్న పోలీస్ డ్యూటీ మీట్‌లో ఉమ్మడి జిల్లా పోలీసులు ప్రతిభ చాటారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి పీసీ -1936 శ్రీనివాస్‌రెడ్డి వీడియోగ్రఫీలో, నారాయణపేట జిల్లాకు చెందిన ఏఆర్ పీసీ -3341 చంద్రశేఖర్ గౌడ్ వ్యక్తులను తనిఖీ చేయడంలో విశేషమైన ప్రతిభ చాటారు. వారికి వెండి పతకం వచ్చింది. దీంతో జోగులాంబ జోన్ పోలీస్ శాఖకు ఓవరాల్ రన్నరప్‌గా నిలవడంతో పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు తీసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ట్రోఫీని గెలిచిన వారికి జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి, నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్ అభినందనలు తెలిపారు.



పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంటున్న మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ రాములు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 8008001824

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836



యాదవనగర్‌లో పైకప్పు కూలిన నీటి ట్యాంక్

? యాదవనగర్‌లో ఉపరితల నీటి ట్యాంకు పైకప్పు కూలి ప్రమాదకరంగా మారింది - కృష్ణమూర్తి

✔ నిరుపయోగంగా ఉన్న ఈ ట్యాంక్‌ను త్వరలో తొలగిస్తాం - అమర్, మున్సిపల్ అధికారి

? మక్తల్ నుంచి నారాయణపేట, గద్వాల పట్టణాలకు వెళ్లే దారులు గుంతలమయంగా ఉన్నాయి. - శేఖర్‌రెడ్డి, మక్తల్

✔ తాత్కాలిక మరమ్మతులకు నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదించాం - శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ అధికారి

? బస్టాండ్ ఆవరణలో ఫ్లెక్సీలతో ఇబ్బందిగా ఉంది. - అంజిరెడ్డి

✔ రుసుం చెల్లించని ఫ్లెక్సీలను తొలగిస్తాం - భోగేశ్వర్లు, పుర కమిషనర్

? పాఠశాలకు వెళ్లే విద్యార్థులపై పందులు దాడి చేస్తున్నాయి - కిరణ్

✔ పెంపకందారులతో మాట్లాడి ఊరు చివరకు మార్చేందుకు ప్రయత్నిస్తాం - గులాం ఖదీర్‌ఖాన్, మున్సిపల్ మేనేజర్

? సంగంబండ రోడ్ వద్ద శబరి కాలనీలో కంకర పోసి ఏడాది అవుతోంది. నిర్మాణం చేయలేదు - సత్యారెడ్డి

✔ గుత్తేదారు పనులు నిలిపివేశాడు. త్వరలో మరో గుత్తేదారుకు అప్పగించి పూర్తిచేయిస్తాం - భోగేశ్వర్లు, పుర కమిషనర్

- న్యూస్‌టుడే, మక్తల్ పట్టణం

తెరపై ఈనాడు

దేవర: వెంకటరమణ(మక్తల్), వనయాంబ(కోస్గి), విశ్వం: రాఘవేంద్ర (మక్తల్)

- న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం, కోస్గి గ్రామీణం



జల్దిబిందె ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా చౌడేశ్వరి మాత కుంభోత్సవం

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని చౌడేశ్వరి మాత దేవాలయం వద్ద శనివారం కుంభోత్సవం వేడుకలు ప్రారంభించారు. జల్దిబిందె ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు దారిపొడవునా మంగళ హారతులు పట్టారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, పల్లకీ సేవ నిర్వహించారు. దేవాంగ సమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు అరికట్టాలి



కలెక్టరేట్‌కు ర్యాలీగా నాయకులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : తెలంగాణలో దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. దాడులకు నిరసనగా శనివారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు పేటలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గొడుగుగేరి హనుమాన్ మందిర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ పట్టణ అధ్యక్షులు నర్సింహులు, శ్రావణ్ కుమార్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డా.రాంబాబు, కార్యదర్శి రఘురామయ్యగౌడ్, మిర్చి వెంకటయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

ధన్వాడ, న్యూస్‌టుడే : మండలంలోని ఏమ్నోన్‌పల్లి శివాలయంలో శనివారం అభిషేకం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. మూల విరాట్, శివలింగాన్ని పంచామృతంతో అభిషేకించారు. అనంతరం అన్నదానం చేశారు. అర్చకులు నంబి ప్రభాకర్, సంఖ్యలో పాల్గొన్నారు.

కమిటీల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

కోస్గి, న్యూస్‌టుడే : కోస్గి పురపాలిక పరిధిలో రెండు ఆలయాల కమిటీల ఏర్పాటు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. వేణుగోపాల స్వామి ఆలయం, శంభుని ఆలయాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో సభ్యులుగా ఉండేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబరు 5వ తేదీలోగా మహబూబ్‌నగర్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లా అభివృద్ధికి వైద్య కళాశాల దోహదం

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : మండలంలోని అప్పక్‌పల్లి వద్ద నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాలను శనివారం సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు సందర్శించారు. ప్రిన్సిపల్ రాంకిషన్‌ను కలిసి కళాశాల గురించి తెలుసుకున్నారు. డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ మాట్లాడుతూ... వెనకబడిన జిల్లా అభివృద్ధికి మెడికల్ కళాశాల దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, ప్రశాంత్, వెంకట్రాములు, నరసింహ, రాము, సాయికుమార్ పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,350 కోట్ల ఉపకార వేతనాలు, బోధనా రుసుములను తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకుడు కిరణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం జరిగిన రౌండ్ టేబుల్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినా ధ్రువపత్రాలు అందక ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పారు. కళాశాలలు మూతపడే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, బుట్టో, పృథ్వీరాజ్, నాగేష్, చంద్రశేఖర్, అంజిరెడ్డి, కళాశాలల ప్రిన్సిపళ్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని మంథన్‌గోడ్ విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.







ప్రభుత్వ పాఠశాలలో వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు.. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు.. బ్రిలియంట్ పాఠశాలలో..

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు



దయానంద విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో రెండో రోజు 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలల్లో ప్రతిభ పాటవ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, బ్రిలియంట్, దయానంద విద్యామందిర్ ఉన్నత పాఠశాలల్లో శనివారం పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ బహుమతి టి.సాత్విక్, ద్వితీయ కె.వీణ, తృతీయ బహుమతి బి.మహేష్‌కు ప్రధానోపాధ్యాయులు అందించారు. బ్రిలియంట్ పాఠశాలలో ప్రథమ బహుమతి పి. శ్రీలేఖ (10వ తరగతి), ద్వితీయ బహుమతి సాయిశ్రీగౌడ్ (9వ), తృతీయ బహుమతి ఇ.అనన్యా (9వ తరగతి) సాధించారు. ప్రధానోపాధ్యాయురాలు రాధ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించి అభినందించారు. దయానంద విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో మొదటి స్థానంలో శివలీల (8వ తరగతి), రెండో స్థానంలో ఆర్.నందిని (10వ) మూడో స్థానంలో వి.కావేరి (9వ తరగతి) నిలిచారు. వీరికి ప్రధానోపాధ్యాయుడు కె.నారాయణ, ఉపాధ్యాయుడు గోపాల్ ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తులు పరిష్కరించాలి



ప్లాటు వద్ద ఎల్ఆర్ఎస్ యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : ఎల్ఆర్ఎస్ పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం మరికల్ మండలంలో పర్యటించిన ఆమె పట్టణ శివారులో ఆత్మకూర్ రహదారి పక్కన ఉన్న ఓ వ్యక్తి దరఖాస్తును ఎల్ఆర్ఎస్ యాప్ ద్వారా పరిశీలించారు. రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పెండింగ్‌లో ఉన్న 1,800 దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం, ఆత్మకూర్ రహదారి పక్కన మండల పరిషత్తు సముదాయ భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు. టీపీవో కిరణ్, తహసీల్దారు జమీల్, ఎంపీవో పావని, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న మహిళా అధికారులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థినికి చట్టాలపై అవగాహన ఉండాలని బేటీ బచావో.. బేటీ పడావో అధికారులు రేణుక, స్వప్న, శ్రావణి అన్నారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ పారామెడికల్ కళాశాలలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. దాడులను ధైర్యంగా ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగ్య, లక్ష్మీకాంత్, నర్సింహ, ఆనంద్ పాల్గొన్నారు.

ఊట్కూరులో మోస్తరు వర్షం

ఊట్కూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలో శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. పత్తి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. వర్షం వల్ల పత్తి తీసేందుకు అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పుడమి తల్లిని కాపాడుకుందాం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : మొక్కలు నాటి పుడమి తల్లిని కాపాడుకుందామని క్లైమెట్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం మక్తల్ పట్టణంలో రాష్ట్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఎర్త్ క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రతి తరగతికి ఇద్దరు చొప్పున స్కూల్ ఎర్త్ క్లబ్‌లను ఎన్నుకొని వారు పర్యావరణ పరిరక్షణలో భాగమయ్యేలా చూస్తామన్నారు. ప్లాస్టిక్ నివారణ, మొక్కల రక్షణ, నీటి నిల్వ లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఓ వృక్షాన్ని తల్లిగా గుర్తించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంఈవో జైపాల్‌రెడ్డి, రాజేశ్వరి, పాలమూరు నాగేష్, కొత్తపల్లి రవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా, న్యూస్‌టుడే : భూమాత పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సీజీఆర్ వ్యవస్థాపకుడు లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం కృష్ణా మండలంలోని కున్సి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎర్త్ క్లబ్ లీడర్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న పెద్ద వృక్షానికి మదర్ ట్రీ గా నామకరణం చేశారు. హెచ్ఎం సంతోషి, ఉపాధ్యాయులు నరేందర్, నర్సింహులు, ఉష, సౌమ్య, నల్లె నర్సప్ప, మారెప్ప, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

కోస్గి, న్యూస్‌టుడే : ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డైరెక్టర్ సంస్థ ప్రతినిధి కృష్ణ అన్నారు. శనివారం కోస్గిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎయిడ్స్ నాలుగు రకాలుగా వ్యాపిస్తుందని, ముందు జాగ్రత్తలతో నియంత్రించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వెంకటేశ్వరి, సంస్థ సభ్యురాలు భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారుతో మేలు



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న గోవర్ధన్‌గౌడ్

ధన్వాడ, న్యూస్‌టుడే : డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే ప్రజా సంక్షేమం సులభతరం అవుతుందని భాజపా కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి జట్రం గోవర్ధన్‌గౌడ్ అన్నారు. మండలంలోని గోటూర్ గ్రామంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వ తీరును గుర్తించి భాజపాకు అండగా నిలవాలని సూచించారు. రాఘవేందర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వెంకట్రాములు, ముగులయ్య తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్‌లో భాగస్వాములవ్వాలి



మై భారత్ డైరీని ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్‌గౌడ్

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : వికసిత భారత్ ఏర్పాటులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నెహ్రూ యువ కేంద్రం(ఎన్‌వైకే) జిల్లా కోఆర్డినేటర్ అనిల్‌గౌడ్ సూచించారు. మండలంలోని మంథన్‌గోడ్ ప్రాథమిక పాఠశాల వద్ద శనివారం మై భారత్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువతకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పరమేశ్వరి, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మంజుల, యువజన సంఘం సభ్యులు రేణుకస్వామి, నరేందర్‌గౌడ్, భాస్కర్, నవీన్, నాని, రాజు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో బీసీ గురుకులాలు



కోటకొండ గురుకుల పాఠశాలలోని తరగతి గదిలో సామగ్రి

ధన్వాడ, న్యూస్‌టుడే : మరికల్‌లో నిర్వహిస్తున్న కోటకొండ మహాత్మా జ్యోతి బాపులే తెలంగాణ వెనుకబడ్డ తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో వసతులు కరవు. విద్యార్థులు తరగతి గదిలోనే సామగ్రిని ఉంచి అక్కడే నిద్రిస్తున్నారు. కోటకొండలో అద్దె భవనం దొరకకపోవడంతో మరికల్‌లోని ఓ ప్రైవేటు భవనంలో ఈ పాఠశాలను నిర్వహిస్తున్నారు. 450 మంది విద్యార్థినులు ఉన్నారు. తరగతి గదులతో పాటు నివాసానికి 40 గదులు ఉండాల్సి ఉండగా 25 మాత్రమే ఉన్నాయి. జిల్లాలో ఉన్న నాలుగు బీసీ గురుకులాల పరిస్థితి ఇదే.

మంజూరు ఓ చోట నిర్వహణ మరో చోట

ప్రభుత్వ, సొంత భవనాలు లేకపోవడంతో ప్రారంభం నుంచి అద్దె భవనాల్లో పాఠశాలల నిర్వహణ కొనసాగుతోంది. నర్వ, మక్తల్, కోటకొండ, నారాయణపేట పట్టణాల్లో బీసీ గురుకులాలున్నాయి. నారాయణపేట, నర్వ, మక్తల్‌కు సంబంధించిన పాఠశాలలు మక్తల్‌లో కొనసాగుతున్నాయి. నారాయణపేట మండలం కోటకొండకు మంజూరైన గురుకులం మరికల్‌లో ఉంది. వీటిని అరకొర వసతులతో అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అటానమస్‌గా వ్యవహరిస్తున్న బీసీ గురుకులాల పర్యవేక్షణ సొసైటీకి చెందిన అధికారులే చూస్తున్నారు. విద్యాధికారులకు బాధ్యతలు అప్పగిస్తే సక్రమంగా ఉంటుందని కొంతమంది అభిప్రాయం.



మరికల్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న కోటకొండ బీసీ గురుకులం

అద్దె కూడా చెల్లించని పరిస్థితి...

అన్ని చోట్ల సమస్యలు వెంటాడుతున్నాయి. క్రీడా మైదానాలు, సరిపడా గదులు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో గురుకులానికి నెలా రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్న ప్రభుత్వం సొంత భవనాలపై దృష్టి సారించడంలేదు. అయితే మరోకొన్ని చోట్ల అద్దె కూడా చెల్లించకపోవడంతో పాఠశాలలకు తాళాలు వేసిన సంఘటనలూ ఉన్నాయి. మరికల్ పట్టణంలోని గురుకులానికి సంబంధించి రెండేళ్ల బకాయిలు చెల్లించలేదని యజమాని చెబుతున్నారు. 'న్యూస్‌టుడే' మరికల్ ప్రిన్సిపల్ శ్రీలతతో మాట్లాడగా... పరిశీలనకు వచ్చిన అధికారుల దృష్టికి సొంత భవనాలు ఏర్పాటును తీసుకెళ్తున్నామని చెప్పారు.

నేలకొరిగిన మహావృక్షం



చెదలు పట్టి వేళ్లతో సహా ఒరిగిన మర్రిచెట్టు

న్యూటౌన్‌లో తితిదే కల్యాణ మండపం ప్రహరీ పక్కన కూలిన మహావృక్షం

పాలమూరులో న్యూటౌన్ ప్రాంతానికి ప్రతీకంగా ఉన్న మహావృక్షం నేలకొరిగింది. శనివారం వర్షం లేదు.. ఈదురు గాలి లేదు. అయినా ఆ మర్రి వృక్షం కూకటి వేళ్లతో సహా కుప్పకూలింది. 40 ఇళ్ల కాలనీ (న్యూటౌన్) ఎక్కడ అంటే మర్రిచెట్టు వద్ద అని చెప్పేవారు. 1960 ప్రాంతంలో ఇక్కడ 40 ఇళ్లకు శంకుస్థాపన చేశారు. అప్పట్లో క్లాక్‌టవర్, టీడీగుట్ట, రామమందిరం, ఆకుల చౌరస్తా, బండ్లగేరి, బ్రహ్మన్‌వాడి, రవీంద్రనగర్, వల్లభ్‌నగర్, హనుమాన్‌పుర, పాత పాలమూరు, రామయ్యబౌలి, మేకలబండ వైపే పాలమూరు పట్టణం విస్తరించి ఉండేది. తొలిసారిగా 40 ఇళ్లు నిర్మించడంతో ఈ ప్రాంతానికి న్యూటౌన్‌గా పేరు సార్థకమైంది. 40 ఇళ్ల నిర్మాణానికి ముందు ప్రస్తుతమున్న రోడ్లు, భవనాల శాఖ సముదాయం, అతిథిగృహం, నీటి పారుదల శాఖ భవనంతో కూడిన ప్రాంతమంతా ప్రభుత్వ భూమి. అప్పట్లోనే ఈ మర్రిచెట్టు ఎంతో విశాలంగా విస్తరించి ఉండేదని చెబుతారు. తొలిసారిగా ప్రభుత్వ స్థలం కేటాయించి గృహనిర్మాణ సంస్థ ద్వారా 40 ఇళ్లు నిర్మించడంతో న్యూటౌన్‌గా పిలుస్తూ వచ్చారు. న్యూటౌన్ ప్రాంత మహిళలు ఈ మర్రిచెట్టును పండగల రోజుల్లో పూజించేవారు. చెట్టుకు చుట్టూ దారాలు చుట్టి మొక్కులు చెల్లించేవారు. ఎంతో అనుబంధమున్న మర్రిచెట్టు నేలకొరగటం చర్చనీయాంశమైంది. - న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం

ద్విచక్ర వాహనం చోరీ

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యుత్తు ఉప కేంద్రంలో ద్విచక్ర వాహనం చోరీ అయింది. వివరాలిలా. ఊట్కూర్ మండలం పులిమామిడి గ్రామానికి చెందిన జె.అంజనేయులు జక్లేర్ విద్యుత్తు ఉప కేంద్రంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ఉప కేంద్రం ముందు ద్విచక్ర వాహనం ఉంచాడు. శనివారం తెల్లవారుజామున చూడగా వాహనం లేదు. సంఘటనపై మక్తల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

కృష్ణానదిలో భక్తుడి గల్లంతు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ఓ భక్తుడు గల్లంతైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన వేణు(34) రెండు రోజుల క్రితం పస్పుల గ్రామ సమీపంలోని దత్తక్షేత్రానికి వచ్చాడు. ఇక్కడ దర్శనం అనంతరం నది ఆవల ఉన్న కురుమపురానికి వెళ్లాడు. బ్యాగు, ఫోన్ పక్కన పెట్టి నదిలో స్నానం చేసేందుకు వెళ్లాడు. రెండు రోజులు అయినా వాటిని తీసుకోవడానికి ఎవరూ రాకపోవడంతో స్వాములు పోలీసులకు సమాచారం అందించారు. జాలర్ల సాయంతో గాలిస్తున్నారు. యాపల్‌దిన్నె పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ మృతిపై ఫిర్యాదు

మద్దూరు, న్యూస్‌టుడే : కొత్తపల్లి మండలంలోని నిడ్జింతలో మహిళ అనుమానస్పద మృతిపై కేసు నమోదైనట్లు ఎస్సై రాంలాల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా... బోనపాటి స్వాతి(23)కి అదే గ్రామానికి చెందిన కాశప్పతో రెండేళ్ల కిందట ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఏడాదిన్నర బిడ్డ ఉండగా ప్రస్తుతం ఏడు నెలల గర్భిణి. శుక్రవారం స్వాతి మరణించగా.. మృతిపై అనుమానాలు ఉన్నాయని తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : వీధి కుక్కల దాడిలో ఏడుగురు గాయపడిన సంఘటన కోస్గిలో శనివారం చోటుచేసుకుంది. పురపాలిక పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం మధ్యాహ్నం నలుగురు విద్యార్థులతో పాటు మరో ముగ్గురిపై కుక్కలు ఒక్కసారిగా దాడిచేశాయి. బాధితులను పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఓ విద్యార్థినిని మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. వీధి కుక్కల నివారణకు పురపాలిక అధికారులు చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి డాక్టరేట్

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి శనివారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ముప్పై ఏళ్లుగా ప్రజా సేవ, విద్యారంగంలో చేసిన కృషి, ప్రమాదం సంభవించిన సమయంలో తక్షణం స్పందించి క్షతగాత్రులను వైద్యశాలలకు చేరవేయడం, కరోనా సమయంలో సొంత ఖర్చులతో వైద్యం అందించడం లాంటి సేవలు గుర్తించినట్లు అవార్డు కమిటీ సభ్యులు తెలిపారు.

తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థుల ప్రగతి

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రుల సహకారం అవసరమని నాచారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమిత్ర అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వెంకట్‌రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీతాల ప్రక్రియ వేగవంతం చేయాలి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నూతనంగా ఉపాధ్యాయుల జీతాల ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా ట్రెజరీ అధికారిని కలిసి విన్నవించారు. ఆదేశాలు రాగానే తప్పకుండా వేగవంతం చేస్తామని అధికారి తెలిపారు. తపస్ అధ్యక్ష, కార్యదర్శులు షేర్ కృష్ణారెడ్డి, నరసింహ, నాయకులు ఉన్నారు.

ముగిసిన నీటి సహాయకుల శిక్షణ



ధ్రువపత్రాలు అందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు విజయకుమార్

కోస్గి, కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : తాగు నీటి సరఫరా కార్మికుల సేవలు ఎనలేనివని, వారికి తగిన గౌరవాన్ని ప్రజలు ఇవ్వాలని జిల్లా గ్రంథాలయ అధ్యక్షుడు వార్ల విజయకుమార్ అన్నారు. కోస్గి, గుండుమాల్ మండలాల్లో నీటి సరఫరా సహాయకులకు ఇచ్చిన శిక్షణను శనివారం ముగిసింది. వారికి ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ తూం భీంరెడ్డి, కోస్గి మండల ప్రత్యేక అధికారి బ్రహ్మానాథం, ఎంపీడీవో శ్రీధర్, సూపరింటెండెంట్ తిరుపతయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



జట్టు సభ్యులను సన్మానిస్తున్న ఎంఈవో అనిల్‌గౌడ్

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : నారాయణపేట పట్టణంలోని మినీ స్టేడియంలో జరిగిన అండర్ 17 వాలీబాల్ పోటీల్లో మక్తల్ జట్టు మొదటి స్థానం సాధించింది. దీంతో రాష్ట్రస్థాయికి నలుగురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పట్టణ మానవ వనరుల కేంద్రంలో శనివారం ఎంఈవో అనిల్‌గౌడ్ జట్టు సభ్యులను సన్మానించి మాట్లాడారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టిలు సైతం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పీడీలు రాజేశ్వరి, పరంజ్యోతి, విష్ణువర్ధన్, రాఘవేందర్, ఈశ్వర్, నరేష్, మీనా తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఊట్కూరు, న్యూస్‌టుడే : విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా టీపీయూఎస్ కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా సమన్వయకర్త సురేష్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం బదిలీల ప్రక్రియపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కొత్త ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, గోపాల్, బన్నేష్, కిరణ్, పృథ్వీరాజ్, మంజుల, నరసింహా, శ్రీధర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్టీయూ టీఎస్ కృషి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ టీఎస్ మాత్రమే పనిచేస్తోందని అ సంఘం మండలాధ్యక్షుడు రఘువీర్ అన్నారు. నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమం శనివారం నారాయణపేటలోని వివిధ పాఠశాలల్లో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్, జహీరుద్దీన్, నరేష్, ఉపాధ్యాయులు సురేందర్, రాకేష్, శంకర్ సింగ్, ఐశ్వర్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కురుమయ్య

నర్వ, న్యూస్‌టుడే : విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఎస్సై కురుమయ్య సూచించారు. శనివారం పాతర్‌చేడ్ ఉన్నత పాఠశాలలో సామాజిక అంశాలపై మాట్లాడారు. బాలికలు, మహిళలను వేధిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మారుతున్న పరిస్థితులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదన్‌రావు, కృష్ణా, పీఈటీ విష్ణు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పీయూ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాల నివారణపై ఎన్ఎస్ఎస్, పోలీస్ శాఖ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వల్ల కేంద్ర నాడీ వ్యవస్థ ఆచేతనంగా మారిపోతుందన్నారు. తద్వారా అనేక రకాల వ్యాధులకు గురై, ప్రాణాలు పోతాయని చెప్పారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మత్తుకు బానిసకావడం వల్ల నేర ప్రవృత్తి పెరుగుతుందన్నారు. మన జిల్లాలో ఒక అమ్మాయి మత్తుకు బానిసై తన తండ్రిని హత్య చేసిందన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ప్రవీణ, ప్రిన్సిపల్స్ నూర్జహన్, బషీర్ అహ్మద్, శాంతిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu